# ఆస్తి పన్నుల వసూళ్లలో వేగం పెంచాలి

- ట్రేడ్ లైసెన్స్ ఫీజుల సేకరణకు ప్రత్యేక కార్యాచరణ
- గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, డిసెంబర్ 5 : పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో పన్నుల విభాగం అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సర్కిళ్ల వారీగా పన్నుల వసూళ్లు, ఫైళ్ల పరిష్కారం, మ్యుటేషన్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించి, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బల్దియాకు పన్నుల రూపంలో రూ. 90.66 కోట్లు లక్ష్యం ఉందని అన్నారు. ఇప్పటి వరకు రూ.37.52 కోట్లు మాత్రమే వసూలైనట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. ఆస్తి పన్నులతో పాటు నీటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సర్కిళ్ల వారీగా కమర్షియల్, నాన్ కమర్షియల్ గృహాల వివరాలు బిల్ కలెక్టర్ల వద్ద ఉండాలన్నారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడా బకాయి దారులకు ముందు నోటీసులు జారీ చేయాలన్నారు. మొదటి 100 బడా బకాయిదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రోజు వారీగా పన్నుల వసూళ్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. వారు క్షేత్రస్థాయిలో పన్నుల సేకరణను పర్యవేక్షించి, రోజు నివేదిక అందజేయాలని సూచించారు. సిటిజన్ చార్టర్‌ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. పౌరసేవల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. సిటీజన్ చార్టర్ అమలును ఆర్‌వో, డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు.

**ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో పురోగతి ఉండాలి**

నగరంలోని ట్రేడ్‌ల నుంచి ఫీజుల వసూళ్లలో పురోగతి సాధించాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై ప్రజారోగ్య విభాగం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు పోవాలన్నారు. బల్దియా వ్యాప్తంగా 31,482 ట్రేడ్‌లు ఉన్నాయని, వాటి ద్వారా ఫీజు రూ.9.60 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.2.50కోట్లు మాత్రమే వసూలైనట్లు తెలిపారు. అత్యధికంగా బకాయి ఉన్న ట్రేడ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, వసూలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో రూట్ మ్యాప్‌లు తయారుచేసి, ఆకస్మికంగా పర్యటించి వసూలు చేయాలన్నారు. ఈ నెల 29 వరకు నగరంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. డ్రైనేజీల శుభ్రం, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలన్నారు. డివిజన్లలో కార్పొరేటర్లను సమన్వయం చేసుకుంటూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. జీపీఎస్ అమర్చిన వాహనాల మరమ్మతు చేసి సమాచారం అందించాలన్నారు. దోమలను అరికట్టడానికి డివిజన్ల వారీగా ఫాగింగ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రవీందర్, ఐటీ మేనేజర్ రమేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

**స్మార్ట్‌సిటీ బోర్డుల పరిశీలన**

స్మార్ట్‌సిటీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల వద్ద ఏర్పాటు చేయనున్న బోర్డులను గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. కార్పొరేషన్ కార్యాలయంలో వాటిని పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నగరంలో స్మార్ట్‌సిటీలో భాగంగా పూర్తయిన అభివృద్ధి పనులు, పురోగతిలో ఉన్న పనుల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బల్దియా పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లలో సుమారు 500 ప్రాంతాల్లో స్మార్ట్‌సిటీ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు సంజయ్‌కుమార్, డీఈ రవికుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ వోలేటి పాల్గొన్నారు.

## ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 5 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి, అమూల్యమైన ఓటు వేసి శాసన సభ్యుడిగా గెలిపించినందుకు నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ రుణపడి ఉంటానని, నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, పార్టీ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం, పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు జిల్లా విద్యార్థి


కీర్తి కౌశిక్

హనుమకొండ సిటీ, డిసెంబర్ 5 : రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టు పోటీల్లో జిల్లా విద్యార్థి కాసు కీర్తి కౌశిక్ ప్రదర్శించిన 'అంధులకు మూడో నేత్రం' అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు డీఈవో అబ్దుల్ హై తెలిపారు. వంద శాతం వైకల్యం కలిగిన కీర్తి కౌశిక్ ఓపెన్ కేటగిరీలో ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థితోపాటు గైడ్ టీచర్లు జీ శ్రీనివాస్, హెచ్ మాధవిని డీఈవోతోపాటు జిల్లా సైన్స్ అధికారి ఎస్ శ్రీనివాస్ స్వామి, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు.

## మత్తు పదార్థాలపై ప్రజలను చైతన్యం చేయాలి

### డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

వరంగల్,డిసెంబర్ 5 : మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్య పర్చాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే బృందాలు, వైద్య సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మానసిక రుగ్మతలపై సలహాలు అవసరమైతే హసన్‌పర్తి ఆరోగ్య కేంద్రంలోని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ప్రహసిత్‌ను సంప్రదించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ ప్రహసిత్ మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్ పాషా మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలకు వెళ్లి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ఉమాశ్రీ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వేముల అశోక్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, నవీన్, ఆర్‌బీఎస్‌కే అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో మాధవరావు

## ప్రైవేట్‌కు దీటుగా ఏవీవీ విద్యా సంస్థలు

వరంగల్, డిసెంబర్ 5 : నాణ్యమైన విద్యాబోధనతో ప్రైవేట్ విద్యా సంస్థలతో ఏవీవీ విద్యా సంస్థలు పోటీ పడుతున్నాయని డీఐఈవో మాధవరావు అన్నారు. మంగళవారం ఏవీవీ జూనియర్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం మాధవరావు మాట్లాడుతూ చక్కటి వాతావరణంలో ఏర్పాటు చేసిన ఏవీవీ కళాశాలలో చదువుకోవడం విద్యార్థులు అదృష్టంగా భావించాలన్నారు. కరస్పాండెంట్ చందా విజయకుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ భజేందర్‌రెడ్డి, చందా శ్రీకాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.


రమేశ్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పీఆర్టీయూ నేతలు

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

హనుమకొండ సిటీ, డిసెంబర్ 5 : కమలాపూర్ మండలం ఉప్పల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బందెల రమేశ్ ఇటీవల మరణించగా, బాధిత కుటుంబానికి మంగళవారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. సంఘంలో కమలాపూర్ మండల శాఖ అసోసియేట్ అధ్యక్షుడిగా కొనసాగుతూ క్రియాశీలక సభ్యుడితో పాటు సంక్షేమ సభ్యత్వం కలిగి ఉన్నందున బీమా చెక్కు అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, అసోసియేటెడ్ అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్ రెడ్డి, కమలాపూర్ అధ్యక్ష, కార్యదర్శులు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, శీలం ప్రకాశ్‌బాబు, రమేశ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, డిసెంబర్ 5 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పుట్ట గొడుగుల పెంపకంపై పది రోజుల శిక్షణా ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 45 ఏళ్లు ఉండి తెలుగులో రాయడం, చదవడం వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు 4 ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలతో హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సదుపాయం ఉంటుందని తెలిపారు. అలాగే, కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఎంకోర్ టెక్‌తో ఎస్సార్ యూనివర్సిటీ ఎంవోయూ


ఒప్పంద పత్రాలను చూపుతున్న వీసీ దీపక్‌గార్గ్, మేనేజింగ్ డైరెక్టర్ సాయి శ్రీనివాస్

హసన్‌పర్తి, డిసెంబర్ 5 : బెంగళూర్‌లోని ఎంకోర్ టెక్ అకాడమీ (ప్రైవేట్ లిమిటెడ్)తో అనంతసాగర్‌లోని ఎస్సార్ యూనివర్సిటీ సీఈసీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ దీపక్‌గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎంకోర్ టెక్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ యూవీ సాయి శ్రీనివాస్ హాజరై ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పవర్ సిస్టమ్ ప్రొటెక్షన్‌లో నూతన సాంకేతికత, పరిశోధన అంశాలను వివరించారు. ఈ ఒప్పందం ద్వారా ప్లేస్‌మెంట్, సెమినార్స్ ఇంటర్న్‌షిప్, ఆర్, డీ అవకాశాలు, ఇండస్ట్రీ విజిట్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డీఎం వినోద్‌కుమార్, రామ్‌దేవ్‌ముఖ్, అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకర్, రాజబాబు పాల్గొన్నారు.

## కుష్టు, క్యాన్సర్ వ్యాధుల నిర్మూలనకు కృషి

దామెర, నవంబర్ 5 : ఓగ్లాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం, మైనార్టీ, ఎంజీజేపీ విద్యాలయాల్లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన, పొగాకు వాడకం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో విద్యాసాగర్, డీహెచ్‌ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ పొగాకుతో ఊపిరితిత్తులు దెబ్బతిని క్యాన్సర్ సోకుతుందన్నారు. అలాగే, కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. డీపీఎంవో రవీందర్, కొమురయ్య, గోపాల్‌రెడ్డి, రాంచందర్, నరేశ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, సౌందర్య, భారతి, శ్రీలత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## మాజీ మంత్రి హయగ్రీవాచారికి నివాళి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 5 : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి, వరంగల్ పురపాలక సంఘం ప్రథమ అధ్యక్షుడు తిరువరంగం హయగ్రీవాచారి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ జంక్షన్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేసి, పాఠశాల విద్యార్థులకు భోజన ప్యాకెట్స్ పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ రావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు జీవీ శ్రీనివాసాచారి, టీ వీరన్న, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీ నందకిశోర్, పాలడుగు ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, వడ్నాల నాగేశ్, కేవీ రంగారెడ్డి, అందె గణేశ్‌బాబు, ఎర్ర రామకృష్ణ, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

VISWAMBHARA
COLLEGE OF EDUCATION
Approved by NCTE and Affiliated to Kakatiya University, Warangal
Khammam Road, Bollikunta, Khila Warangal (Mandal),Warangal-506 005, Telangana State
ADMISSION NOTIFICATION FOR B.ED B-CATEGORY SEATS
Candidates seeking admission in to **B.Ed** course under B-Category seats for the **Academic Year 2023-24** should apply in the prescribed application form available in the college office on all working days. Last date for submission of application is **05:00pm on 15.12.2023**. Admissions will be made as per the guidelines issued by TSCHE.
Date:05.12.2023
Sd/- Secretary & Correspondent
Contact No.s: 9948262646, 9440556304 8886536969